క్లుప్తంగా

క్రికెట్ కిట్ అందజేత



క్రికెట్ కిట్ అందజేస్తున్న మత్స్యకార సంఘం నాయకులు

చిల్లకూరు : అదానీ క్రిష్ణపట్నం పోర్టు, అదానీ ఫౌండేషన్ ప్రతినిధులు సోమవారం గుమ్మళ్లదిబ్బ గ్రామంలోని ముస్లిం యువతకు క్రికెట్ కిట్ అందజేశారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లిం యువత క్రికెట్ కిట్ కావాలని అదానీ ఫౌండేషన్ ప్రతినిధులను కోరారు. ఈ క్రమంలో వారు స్థానిక మత్స్యకార నాయకుల ద్వారా క్రికెట్ కిట్ అందజేశారు. మత్స్యకార సంఘం నాయకుడు మేకల వెంకయ్య, అదానీ ఫౌండేషన్ హెడ్ రాకేష్‌రంజన్, కొండూరు సురేష్, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ మృతిపై విచారణ చేయాలని నిరసన



ర్యాలీ చేస్తున్న పాస్టర్లు

కలువాయి(సైదాపురం) : పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ చేయాలని డిస్ట్రిక్ట్ పాస్టర్స్ ఫెలోషిప్ నేతలు డిమాండ్ చేశారు. వారు సోమవారం కలువాయి బస్టాండ్‌లో శాంతియుతంగా నిరసన తెలిపారు. అంతకుముందు ర్యాలీ చేపట్టారు. పాస్టర్ ఆనంద్ మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్‌ను కొందరు దుండగులు హత్య చేసి ప్రమాదంలో మృతిచెందినట్లు చిత్రీకరించారని ఆరోపించారు. ప్రభుత్వం నిష్పాక్షికంగా విచారణ చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో పాస్టర్లు సంపత్‌కుమార్, జాన్ భాస్కర్, రవి తదితరులు పాల్గొన్నారు.

గ్రామోత్సవం



ఊరేగుతున్న సుబ్రమణ్యేశ్వర స్వామి

చిట్టమూరు : మండలంలోని మల్లాం గ్రామంలో స్వయంభువుగా వెలసిన వళ్లీదేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి గ్రామోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉగాది పర్వదినం సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి గ్రామంలో ఊరేగించారు. మహిళలు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

పూలతోటలో ఎస్‌ఐ పల్లెనిద్ర



ప్రజలతో మాట్లాడున్న ఎస్‌ఐ అజయ్‌కుమార్

దొరవారిసత్రం : మండలంలోని పూలతోట గ్రామంలో సోమవారం రాత్రి ఎస్‌ఐ అజయ్‌కుమార్, పోలీసులు పల్లెనిద్ర చేపట్టారు. ఇందులో భాగంగా గ్రామస్తులకు వాహనాల చట్టం, శక్తి యాప్, సైబర్ క్రైమ్, రోడ్డు ప్రమాదాలు, స్మార్ట్ లాక్ ఉపయోగం, 100, 112 నంబర్ల వినియోగంపై అవగాహన కలిగించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

చిల్లకూరు : మండలంలోని బూదనం గ్రామంలో సోమవారం ఓం నమః శివాయ సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గూడూరుకు చెందిన సాయిప్రియ ఆస్పత్రి వైద్యులు సాయిశరత్‌రెడ్డి రోగులకు పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్ర ఎక్కువగా ఉందని, ఉదయం 10 గంటలలోపే పనులు ముగించుకుని ఇంటికి చేరుకోవాలన్నారు. సాయంత్రం 5 గంటల తర్వాత బయటకు వెళ్లాలని సూచించారు. ఇటీవల ఎక్కువ మంది షుగర్ వ్యాధి బారిన పడుతున్నారని, 40 ఏళ్లు దాటిన వారు షుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుని మందులు వాడాలన్నారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం

కోట: మండలంలోని కొత్తపాళెం వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఉగాది ఉత్సవాల్లో భాగంగా శ్రీనివాస శాంతి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేదపండితులు దీవి అనంతాచార్యుల బృందం వైఖానస ఆగమోక్తంగా కల్యాణ క్రతువును జరిపించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త నేదురుమల్లి ప్రసేన్‌కుమార్ రెడ్డి, మైథిలి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

కండలేరులో 48.664 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 48.664 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,320, పిన్నేరుకాలువకు 5, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

నిమ్మ రైతుకు నిరాశ



నిమ్మ ధరలు ఆశించిన మేర లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రతి ఏటా మార్చి నెలాఖరుకు ధరలు పెరిగి కొంత మేర లాభాలు వచ్చేవి. ప్రస్తుతం దిగుబడి పెరగడంతోపాటు ఢిల్లీ మార్కెట్‌ల్లో ధరలు పెరగకపోవడంతోనే ధరలు లేవని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం 50 కేజీల బస్తా కాయలు రూ.4,500 నుంచి రూ.6 వేలు వరకు ఉంది. నాణ్యత కలిగిన కాయలకు సైతం ధరలు లేకపోవడంతో ఖర్చులు పోనూ పెద్దగా ఆదాయం రావడం లేదని రైతులు చెబుతున్నారు. - సైదాపురం

శిథిలావస్థలో పాఠశాల



మండలంలోని వెదురుపట్టు ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. పిల్లలు ఈ భవనాన్ని ఆనుకునే ఆడుకుంటూ ఉంటారు. ఈ క్రమంలో ఎప్పుడు కూలిపోతుందోనని విద్యార్థులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన భవనాన్ని కూల్చివేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. - దొరవారిసత్రం

అధ్వానంగా మరుగుదొడ్లు





మండలంలోని వెదురుపట్టు, వెదురుపట్టురాజుపాళెం గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. నీటి వసతి లేకపోవడంతో నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకున్నాయి. పిల్లలు అత్యవసర సమయాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బాలికలు ఇళ్లకు పరుగులు తీయాల్సి వస్తోంది. అధికారులు స్పందించి మరుగుదొడ్లను బాగు చేసి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. - దొరవారిసత్రం

భక్తిశ్రద్ధలతో రంజాన్

- ఘనంగా రంజాన్ వేడుకలు
- ఈద్గాల్లో ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు
- రంజాన్ విశిష్టతను వివరించిన మత పెద్దలు
- పేదలకు దాన ధర్మాలు



వెంకటగిరి రూరల్ : వెంకటగిరిలో ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు

వెంకటగిరి రూరల్/సైదాపురం/దొరవారిసత్రం/ఓజిలి/కోట/చిల్లకూరు/తడ/రాపూరు/నాయుడుపేట టౌన్/సూళ్లూరుపేట/వాకాడు /చిట్టమూరు : వెంకటగిరి, సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల్లోని ముస్లింలు సోమవారం రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నెలరోజులు నియమనిష్టలతో ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లింలు ఈదుల్ ఫితర్ ప్రార్థనలు చేశారు. ఉదయమే సంప్రదాయ దుస్తులు ధరించి ఊరేగింపుగా ఈద్గాలకు చేరుకున్నారు. అక్కడ సామూహిక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు ఈదుల్ ఫితర్ ప్రత్యేకతను వివరించారు. జకాత్‌లో భాగంగా దాన ధర్మాలు చేయాలని సూచించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. పేదలకు దానం చేశారు. ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

- వెంకటగిరి పట్టణంలోని ముస్లింలు మల్లమ్మగవడి ప్రాంతం వద్ద ఉన్న ఈద్గా వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు రంజాన్ పండుగ విశిష్టతను వివరించారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఆయనకు మత పెద్దలు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లింలు ప్రార్థనలు చేసుకునేందుకు ప్లాట్, కాంపౌండ్‌వాల్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు.
- సైదాపురం మండలంలోని సైదాపురం, తురిమెర్ల, ఊటుకూరు, కలిచేడు, గిద్దలూరు, మర్లపూడి గ్రామాల్లోని ముస్లింలు ఈద్గా వద్దకు చేరుకున్నారు. మత పెద్దలు దైవ సందేశాన్ని వినిపించారు. అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. పేదలకు జకాత్ దానం చేశారు.
- దొరవారిసత్రం మండలంలోని వేణుంబాకం, కల్లూరు, పోలిరెడ్డిపాళెం, గొల్లపాళెం, డీవీ సత్రం తదితర గ్రామాల్లోని ముస్లింలు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రంజాన్ పండుగ ప్రత్యేకతను మత గురువులు వివరించారు. ప్రతి ఒక్కరూ అల్లా సూచించిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు.
- ఓజిలి మండలంలోని ఆర్మేనిపాడు, కురుగొండ, ఓజిలి, రాచపాళెం, నెమళ్లపూడి తదితర గ్రామాల్లోని ముస్లింలు మసీదుల్లో రంజాన్ వేడుకలు జరుపుకున్నారు. మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు.
- కోట మండలంలోని ముస్లింలు రంజాన్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కోటలోని జామియా మసీదు నుంచి మత పెద్దలు శ్యామ్‌సుందరపురంలో ఉన్న ఈద్గా వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చంద్రశేఖరపురం, గోవిందపల్లి, చిట్టేడు, కొత్తపాళెంలోని మసీదుల్లోనూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.
- వాకాడు మండలంలోని మసీదులు, ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారుఉ. మత పెద్దలు మాట్లాడుతూ ఆర్థికంగా ఉన్నవారు లేని వారికి దానం చేయాలని, తద్వారా అల్లా ప్రేమను పొందుతారని పిలుపునిచ్చారు. అనంతరం ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.
- గూడూరులోని దర్గా వీధి, ఒకటో పట్టణం, రెండో పట్టణంలోని జామియా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పేదలకు దానం చేశారు.
- చిల్లకూరు మండలంలోని చిల్లకూరు, పారిచెర్లవారిపాళెం, నాంచారమ్మపేట, చింతవరం, ఏరూరు, మోమిడి, గుమ్మళ్లదిబ్బ, ఉడతావారిపాళెం, కడివేడు గ్రామాల్లో ముస్లింలు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.
- తడలో రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు ఘనంగా నిర్వహించారు. పూడి గ్రామంవద్ద ఉన్న ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వారికి మిత్రులు, సన్నిహితులు శుభాకాంక్షలు తెలిపారు.
- రాపూరు మండలంలోని ముస్లింలు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. రాపూరులోని పెద్ద పీర్ల చావడి వద్దకు ముస్లింలు పెద్ద ఎత్తున చేరుకుని ర్యాలీగా ఈద్గాకు చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పేదలకు దానాలు చేశారు.
- నాయుడుపేట పట్టణంలోని ముస్లింలు జామియా మసీదు సమీపంలో షాదీ మంజిల్ ఈద్గా వద్ద ఈదుల్ ఫితర్ ప్రత్యేక నమాజు చేశారు. మసీదు మౌలానా అబ్బు బక్కర్ రంజాన్ పండుగ విశిష్టతను వివరించారు. చెడు వ్యసనాలకు దూరంగా వుండి మంచి మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. తమ సంపాదనలో కొంత దానం చేయాలని సూచించారు. నిరుపేదలకు నగదు దానం చేశారు. అదే విధంగా దర్గా వద్ద అమీర్‌షావాలి మసీదు మౌలానా ముద్దసీర్, పాత బస్టాండు సమీపంలోని నూర్ మసీదు వద్ద హఫీజ్ హుసేన్ సాహెబ్, అమరా గార్డెన్ మసీదు వద్ద మైలానా పఠాన్ ఇస్మాయిల్ ప్రత్యేక నమాజు చేపట్టారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈద్గాకు స్థలం కేటాయించేలా ఎమ్మెల్యే విజయశ్రీ చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, నెలవల రాజేష్, ఉయ్యాల ప్రవీణ్ తదితరులు మౌలానాలు, మత పెద్దలను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.
- సూళ్లూరుపేటలో రంజాన్ పండుగను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని జామియా, అక్బరియా, కోటపోలూరు, మన్నారుపోలూరు, పెరిటిపాడు, కేఆర్‌పీ మసీదుల ఆధ్వర్యంలో ముస్లింలు మన్నారుపోలూరు వద్ద ఉన్న ఈద్గా వద్ద సామూహిక ప్రార్థనలు చేశారు. ఇమామ్ షబ్బీర్ అహ్మద్ మాట్లాడుతూ నిరుపేదలకు దానధర్మాలు చేయడమే రంజాన్ పండుగ ఉద్దేశమన్నారు. అనంతరం అక్బరియా మసీదు యువత పేదలకు అన్నదానం చేశారు.
- చిట్టమూరు మండలంలోని ముస్లింలు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. మల్లాం, చిట్టమూరు, కోగిలి, తాడిమేడు, ఉప్పలమర్తి, ఎల్లసిరి గ్రామాల్లో ఉన్న మసీదుల్లో వద్ద సామూహిక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు మహమ్మద్ ప్రవక్త బోధించిన సూక్తులను వివరించారు. పేదలకు దాన ధర్మాలు చేశారు.



సూళ్లూరుపేట రూరల్ : మన్నారుపోలూరులోని ఈద్గా వద్ద దువా చేస్తున్న ముస్లింలు



చిట్టమూరు: ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



సైదాపురం : ఊటుకూరులో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న పెద్దలు,చిన్నారులు



కోటలో..



చిల్లకూరు : గూడూరు నమాజ్ కట్ట వద్ద ..



తడ : పూడి గ్రామం మసీదు వద్ద ..



రాపూరులోని ఈద్గా వద్ద ...



నాయుడుపేట టౌన్: జామియా మసీదు ఈద్గా వద్ద ...

అఖిల భారత రైతు కూలీ సంఘం నేతల నిరసన



సైదాపురంలోని బస్టాండ్‌లో ఆందోళన చేస్తున్న అఖిల భారత రైతు కూలీ సంఘం నేతలు

సైదాపురం: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజా సంపదను కార్పొరేట్‌కు అప్పగించేందుకు కుట్రలు చేస్తోందని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కన్వీనర్ డీపీ పోలయ్య ఆరోపించారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలను ఎండగడుతూ సోమవారం సైదాపురం బస్టాండ్‌లో అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను హరించడంతోపాటు ఫెడరల్ వ్యవస్థను ధ్వంసం చేస్తోందని దుయ్యబట్టారు. దేశంలో 70 శాతం మంది ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికి ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. దీనికి వ్యతిరేఖంగా ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నేతలు పందిటి వెంకటయ్య, చెంగల్‌రావు, మమత, అనూష, నాగమణి, కోటయ్య, శ్రీను, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కూర్మావతారంలో శ్రీరాముడి దర్శనం



సూళ్లూరుపేట: పట్టణంలోని బ్రాహ్మణవీధిలో వున్న సీతారాముల ఆలయంలో శ్రీరామ నవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం స్వామి వారు కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

వామనుడిగా శ్రీరాముడు

అదేవిధంగా బాలాంజనేయస్వామి ఆలయంలో శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారు వామన అలంకారంలో భక్తులను అనుగ్రహించారు.

పోలేరమ్మ ఆలయ నిర్మాణానికి కృషి



అధికారులు, నాయకులతో సమీక్షిస్తున్న నెలవల

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట గ్రామ దేవత పోలేరమ్మ ఆలయ నిర్మాణంతోపాటు గడియారం సెంటర్ వద్ద పెద్ద సర్కిల్ ఏర్పాటుకు కృషి చేస్తామని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆయన సోమవారం రాత్రి పోలేరమ్మ ఆలయం వద్ద పలువురు పారిశ్రామిక వేత్తలు, నాయకులు, వివిధ వర్గాల ప్రజలతో సమీక్షించారు. గడియారం స్తంభాన్ని తొలగించి స్తంభం పక్కనే ఉన్న పోలేరమ్మ విగ్రహాన్ని చావడి వద్ద ప్రతిష్ఠించడం, దేవదాయ శాఖ అధ్వర్యంలో దాతల చొరవతో ఆలయం నిర్మాణం చేపట్టడంపై సలహాలు తీసుకున్నారు. పోలేరమ్మ ఆలయం మధ్యలో నాలుగు రోడ్లు కలిసేలా భారీ సర్కిల్ ఏర్పాటుపైనా సూచనలు అడిగారు. ఆగమ వేదపండితులు, ఇంజనీరింగ్ అధికారుల సూచనలు తీసుకుని పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఈవో రవికృష్ణ, సీఐ బాబి, పోలేరమ్మ ఆలయ పెదకాపు ఆరవ భూమి శ్రీనివాసులు రెడ్డి, నాయకులు శిరసనంబేటి విజయ భాస్కర్ రెడ్డి, ఆకుల కుబేరు మణి, పెసల కిషోర్ బాబు, గుంటూరు లక్ష్మయ్య, నల్లబోతుల రామారావు, నానాబాల సుబ్బారావు, సన్నారెడ్డి చంద్రారెడ్డి చిరువేళ్ల మునిరాజా, గాదిరెడ్డి గోపి, పోలేరమ్మ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బంగారుపేటకు చేరుకున్న పెనుగొండ పీఠాధిపతి



పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతికి స్వాగతం పలుకుతున్న నిర్వాహకులు.

వెంకటగిరి రూరల్ : లోక కల్యాణం, హిందూ ధర్మ పరిరక్షణ కోసం పెనుగొండ పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి బాలస్వామీజీ తెనాలిలోని విద్యాపీఠం నుంచి తిరుమలకు చేపట్టిన మహాపాదయాత్ర సోమవారం వెంకటగిరిలోని బంగారుపేటకు చేరింది. ఆయనకు కోదండరామస్వామి ఆలయ నిర్వాహకుడు యారం శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్థానికులు మంగళవాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. ఆయన బంగారుపేట కోదండరామ స్వామి ఆలయానికి చేరుకున్నారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య శాస్త్రోక్తంగా శ్రీవారి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. అనంతరం ప్రజ్ఞానంద సరస్వతి బాలస్వామీజీ భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు.

ఇద్దరు యువకులకు గాయాలు

కలువాయి(సైదాపురం) : మండలంలోని తోపుగుంటలో సోమవారం బైక్ బోల్తాపడి ఇద్దరు యువకులు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. చీపినాపి ఎస్సీ కాలనీకి చెందిన గణేష్, కళ్యాణ్ ద్విచక్ర వాహనంపై తోపుగుంట వైపు వెళుతున్నారు. తోపుగుంట సమీపంలో ఉన్నట్టుండి గేదె అడ్డం రావడంతో బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. గాయపడిన ఇద్దరు యువకులను స్థానికులు ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్రమణకు గురవుతున్న బస్టాండ్

కలువాయి(సైదాపురం) : కలువాయి బస్టాండ్ రోజు రోజుకు ఆక్రమణకు గురవుతోంది. గతంలో ఆక్రమణలను తొలగించాలంటూ పంచాయతీ పాలక వర్గం తీర్మానం కూడా చేసింది. అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఈ విషయమై సంబంధింత ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పిల్లర్లకే పరిమితం



పూలతోటలో..



వేణుంబాకంలో..

దొరవారిసత్రం : చెత్త నుంచి సంపద సృష్టించి పంచాయతీలను అభివృద్ధి బాటలో నడిపిస్తామని కూటమి నేతల హామీలు ప్రసంగాలకే పమితమయ్యాయి. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన సంపద తయారీ కేంద్రాలు క్రమేపీ దెబ్బతింటూ శిథిలావస్థకు చేరుతున్నారు. మరికొన్ని పిల్లర్లు, తొట్టెల నిర్మాణానికే పరిమితమయ్యాయి. దొరవారిసత్రం మండలంలో 22 పంచాయతీలున్నాయి. వాటిలో 16 పంచాయతీల్లో 2017-18లో రూ.3.50 లక్షల నుంచి రూ.5 లక్షలు వెచ్చించి సంపద తయారీ కేంద్రాలు నిర్మించారు. ఇందులో వేణుంబాకం, బూదూరు గ్రామాల్లో పిల్లర్లకే పరిమితమయ్యాయి. పూలతోటలో ఒక షెడ్డు, చెత్త వేయడానికి 20 తొట్లు నిర్మాణం చేపట్టారు. పిల్లర్లు వేసి షెడ్డును వదిలేశారు. తొట్టెలు నిర్మించినా పనికిరాకుండా పోయాయి. తొగరాముడి గ్రామంలోని సంపద తయారీ కేంద్రం సైతం శిథిలావస్థకు చేరింది.